సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



ప్రతిభకు 'ఉపకారం'

ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువులు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తోంది. 8లో



వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం ఘనంగా త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆర్‌జేడీ విజయ్ భాస్కర్



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

నక్కపల్లి: ఈ ఏడాది పదోతరగతి పరీక్ష ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ విజయ్ భాస్కర్ అన్నారు. గురువారం నక్కపల్లిలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఇప్పటినుంచే పదోతరగతి పరీక్షలపై దృష్టిపెడితే మంచి ఫలితాలుసాధించవచ్చని తెలిపారు. కేవలం పదోతరగతికే పరిమితంకాకుండా అన్ని తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు ప్రతి పాఠశాలను సందర్శించి పర్యవేక్షణచేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈసమావేశంలో డీఈవో అప్పారావు నాయుడు, డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు, ఎంఈవోలు కుంచం నరేష్, నాగన్న దొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ కోసం ఆధార్ లింక్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: గ్యాస్ సబ్సిడీ నగదు జమకాని లబ్ధిదారులు నేరుగా బ్యాంకుకు వెళ్లి తమ ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దీపం-2 పథకంలో భాగంగా 2వ విడత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, బ్యాంకు ఖాతాకు సబ్సిడీ నగదు జమపై అధికారులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో 2వ విడత సిలిండర్ల పంపిణీలో 805 మందికి సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాలో జమ కాలేదన్నారు. ఇందుకు గల కారణాలు లబ్ధిదారులకు తెలియజేయాలని తెలిపారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ ఎన్‌పీసీఐ లింక్ అయిన తర్వాత మాత్రమే గ్యాస్ సబ్సిడీ నగదు జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

అనకాపల్లి: రాష్ట్రంలో సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేరగాళ్లు కొత్త పంథాలను అవలంబిస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఓటీపీ, లింకులు, తప్పుడు ఎస్‌ఎంఎస్‌లు, ఈమెయిల్స్, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, లాటరీ, లక్కీ డ్రా మోసాలు, లవ్, ఫ్రెండ్‌షిప్ స్కామ్‌లు, నకిలీ జాబ్, లోన్ ఆఫర్లు, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసాలకు పాల్పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరికీ ఓటీపీ, యూపీఐ పిన్, నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డు చెప్పొద్దన్నారు. అపరిచిత లింకులు లేదా యాప్‌లపై క్లిక్ చేయొద్దని సూచించారు. నమ్మకంలేని వెబ్‌సైట్లలో షాపింగ్ చేయవద్దని, పెద్ద మొత్తంలో బహుమతులు గెలిచారని వచ్చే మెసేజ్‌లను నమ్మొద్దని కోరారు. మోసపోయిన వ్యక్తులు తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేసి, ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం కార్యవర్గం



అధ్యక్షుడు వినోద్‌బాబు

పరవాడ: అనకాపల్లి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లఅసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్ది వినోద్‌బాబు(పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల), ఉపాధ్యక్షుడిగా కె.శ్రీహరి(కేడీపేట), కార్యదర్శిగా ఎ.శోభ(నర్సీపట్నం), సహాయ కార్యదర్శులుగా డాక్టర్ ఏఆర్‌టీ సుజాత(కోటవురట్ల), ఎల్.సత్యవతి (కొత్తకోట)లు ఎన్నికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

నర్సీపట్నంలో తీవ్ర ఉద్రిక్తత

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన చేపట్టిన వైఎస్సార్‌సీపీ

మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయవద్దంటూ శాంతియుతంగా నిరసనకు సిద్ధపడిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి మండలాల నుంచి నాయకులు హాజరుకాకుండా ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేశారు. గణేష్‌ను అరెస్టు చేసి, ఎక్కడికి తీసుకెళుతున్నారో చెప్పకుండా రెండు గంటల పాటు కారులో తిప్పారు. దీంతో నర్సీపట్నంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



పోలీసులు లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ప్రతిఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త పెట్ల ఉమాశంకర్ గణేష్

- అడ్డుకున్న పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే గణేష్ అరెస్ట్
- రెండు గంటల పాటు కారులో తిప్పిన వైనం
- ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పని పోలీసులు
- ఉదయం నుంచే పలువురు వైఎస్సార్‌సీపీ నాయకుల హౌస్ అరెస్టు



గణేష్ కారును అడ్డగించిన పోలీసులు

సాక్షి, అనకాపల్లి/ నర్సీపట్నం: భీమబోయినపాలెం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పీపీపీ విధానం వద్దంటూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం నర్సీపట్నంలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. గణేష్ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు మున్సిపాల్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్దకు తరలివచ్చారు. సీబీఎం కాంపౌండ్ నుంచి అబిద్‌సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి, ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. అయితే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను గృహ నిర్బంధం చేశారు. పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల వద్ద అధిక సంఖ్యలో పోలీసులు మోహరించారు. నిరసన కార్యక్రమానికి వస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను అడ్డుకోవడంతో ఆయన కారు దిగి అక్కడే ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేత పట్టి రోడ్డుపై బైఠాయించారు. ఈ సమయంలో గణేష్‌కు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల నిరంకుశ వైఖరి నశించాలంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గణేష్‌ను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి మాకవరపాలెం తరలించారు. మిగిలిన వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. సాయంత్రానికి వీరందరినీ విడుదల చేశారు. ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రైవేటీకరణపై పోరాటం ఆగదని ఈ సందర్భంగా గణేష్ హెచ్చరించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు పోలీసులను ప్రయోగించి మెడికల్ కాలేజీ ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. పీపీపీ విధానం అంటే మెడికల్ కాలేజీలను అమ్మేయడమేనన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య కళాశాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనివ్వబోమన్నారు. అరెస్టులకు భయపడే ప్రసక్తిలేదని తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, విద్యార్థి విభాగం నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, వీరమాచినేని జగదీశ్వరి, పెట్ల అప్పలనాయుడు, ఎంపీపీ సర్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, నర్సీపట్నం మున్సిపల్ చైరపర్సన్ సుబ్బలక్ష్మి, నియోజకవర్గంలో అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.



నర్సీపట్నం మెయిన్ రోడ్డుపై ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నాయకుల హౌస్ అరెస్టు

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నర్సీపట్నంలో నిర్వహించతలపెట్టిన శాంతియుత ర్యాలీకి నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, నర్సీపట్నం రూరల్ గ్రామాల నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. మరికొంతమంది నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. గొలుగుండ మండలంలో పలు గ్రామాల నుంచి వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఆటోలు, బైక్‌లపై నర్సీపట్నం వెళుతున్న పార్టీ శ్రేణులను ఎస్‌ఐ రామారావు ఆధ్వర్యంలో అయ్యన్నపాలెం వద్ద నిలిపివేశారు. మాకవరపాలెం మండలంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిటికెల రమణతో పాటు పలువురు నేతలను ముందస్తుగా మాకవరపాలెం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నాతవరం మండలం నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌ల, ఎంపీటీసీలు, కార్యకర్తలను, నర్సీపట్నం-తుని మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డులో తాండవ జంక్షన్, డి.యర్రవరం జంక్షన్‌లో నాతవరం ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు అడ్డుకున్నారు. విధంగా గ్రామాల్లో కూడా పోలీసులు వెళ్లి పార్టీ నాయకులు ర్యాలీకి వెళ్లకుండా నిలుపుదల చేశారు. నాతవరం మండలానికి చెందిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



గొలుగొండ నుంచి ర్యాలీకి వెళుతున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



తాండవ జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుంటున్న నాతవరం ఎస్‌ఐ తారకేశ్వరరావు



నాయకులు, కార్యకర్తలను వాహనంలో పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఎన్నికేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదు: మాజీ ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ విలేకరులతో మాట్లాడారు. తమపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామన్నారు. కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తలపెడితే.. అక్రమ అరెస్టులతో అడ్డుకున్నారని, పార్టీ నాయకులను, కార్యకర్తలను బెదిరించి, హౌస్ అరెస్టులు చేయడం దుర్మార్గమని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి పోలీసులు తొత్తులుగా మారిపోయారని, తనను అక్రమంగా అరెస్ట్ చేసి జిల్లాలో ఉన్న పలు పోలీస్‌స్టేషన్‌లకు తిప్పి, చివరిగా మాకవరపాలెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విడుదల చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు భీమబోయినపాలెం వద్ద మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే.. కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా పీపీపీ విధానంలో కళాశాల అమ్మేయాలని చూస్తోందంటూ మండిపడ్డారు. తక్షణమే పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన బూడి, అనురాధ

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపిన అనురాధ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ

దేవరాపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను నియమించడం పట్ల ఈర్లె అనురాధ మాజీ సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో ఏ బాధ్యతను తనకు అప్పగించిన శిరసా వహిస్తూ, వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతుగా అహర్నిశలు కృషి చేస్తానని అనురాధ చెప్పారు. జిల్లా, నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను మాజీ సీఎం జగన్ ఆరా తీసినట్లు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం

సబ్బవరం: యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి ఇండస్ట్రియల్ ఐపీవో త్రివేణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ సహకారాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్(జెడ్) సర్టిఫికెట్ గురించి వివరించారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలకు ఉచితంగా అందిస్తుందన్నారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ లోన్స్ గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, ఏజెడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ కంపెనీ సీఈవో కాళ్ల జగపతి, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శరగడం సాగర్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎం.గంగరాజు, కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ' ప్రయాణం గందరగోళం

- రాత్రే నగరానికి చేరుకున్న అభ్యర్థులు
- ఆఖరి క్షణంలో రద్దుతో నిరాశ

ఆరిలోవ: డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు అమరావతిలో శుక్రవారం జరగాల్సిన నియామక పత్రాలు అందించే కార్యక్రమం వాయిదా పడినట్లు డీఈవో ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. గుంటూరులో భారీ వర్షాల కారణంగా ఈ కార్యక్రమం రద్దయినట్లు డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి నుంచి సమాచారం అందిందని పేర్కొన్నారు. దీంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎంపికైన 1,134 మంది అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో ఒకరిని అమరావతి తీసుకువెళ్లడానికి జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం నుంచి అమరావతి వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సులను సైతం సిద్ధం చేశారు. అరకు, పాడేరు, ముంచంగిపుట్టుతో పాటు అనకాపల్లి జిల్లాలోని శివారు ప్రాంతాల అభ్యర్థులు బుధవారం రాత్రే నగరానికి చేరుకున్నారు. తెలిసినవాళ్ల ఇళ్లల్లో, లాడ్జీల్లో రాత్రి ఉన్నారు. తీరా తెల్లవారేసరికి కార్యక్రమం వాయిదా పడినట్లు కబురు తెలియడంతో నిరాశతో ఇసురోమంటూ ఇంటిముఖం పట్టారు. మరికొందరు గురువారం తెల్లవారుజామున వాహనాల్లో ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయానికి పయనమయ్యారు. మార్గంమధ్యలో వాయిదా పడినట్లు మెసేజ్‌లు చూసి తిరిగి ఇంటికి తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది. ఇంతకీ ప్రభుత్వం వర్షం కారణంగానే డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా వేసిందా? లేదంటే హైకోర్టు ధర్మాసనం తీర్పు వల్ల వాయిదా వేసిందా? అనే అనుమానాలు అభ్యర్థుల్లో రేకెత్తుతున్నాయి.

డ్రగ్స్, నేర రహితంగా జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాను నేర, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. విజయవాడలో ముఖ్యమంత్రితో జరిగిన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చర్చించిన జిల్లాకు సంబంధించిన అంశాలపై ఆమె గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, బస్టాపుల వద్ద, గ్రామాల్లో ఆకతాయిల బెడద నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు సూక్ష్మ సేద్యం నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. గ్రామాల్లో మునగ చెట్ల పెంపకం చేపట్టడంతో పాటు మునగ ఆకుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. దోబీ ఘాట్లలో ఆధునిక వసతులు, బ్యాంక్ లింకేజీ కల్పించాలన్నారు. అక్టోబర్ 1న ఆటో డ్రైవర్లకు రూ.15వేల సాయం అందించనున్నట్టు చెప్పారు. గ్రామాల్లో శ్మశానవాటికలను నిర్మించేందుకు దరఖాస్తులు స్వీకరించాలని, మేకలు, గొర్రెల పెంపకానికి పీఎంఈజీసీ దరఖాస్తులను పరిశీలించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు స్థల పరిశీలన చేయాలన్నారు. గ్రామాల్లో ట్యాంకులు, చెక్ డ్యామ్‌లను శుభ్రపరచాలని, రోడ్లపై గుంతలు పూడ్చడానికి అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బెల్టు షాపులు లేకుండా చూడాలని, మైనింగ్ శాఖ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం

- బల్క్‌డ్రగ్‌పార్క్ రద్దుచేయాల్సిందే
- ఐదోరోజు కొనసాగిన మత్స్యకారుల ఆందోళన



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కంబాల, వీసం తదితరులు



మత్స్యకారులతో కలసి నిరాహార దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్‌పార్క్ వ్యవహారంలో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని, ఎట్టిపరిస్థితుల్లోను వెనక్కి తగ్గేది లేదని మత్స్యకారులు స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేయాలంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన నిరాహారదీక్ష గురువారం ఐదో రోజు కొనసాగింది. శాంతియతంగా నిరసన తెలుపుతున్న మత్స్యకారులకు పోలీసులు అంటంకాలు కల్పిస్తున్నారు. టెంట్లువేసేందుకు, మైక్ సెట్‌కు పర్మిషన్ ఇవ్వ లేదు. దీంతో గురువారం కూడా మండుటెండలో గొడుగులు పట్టుకుని నిరాహారదీక్ష కొనసాగించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన మత్స్యకారులు, ఇతర సామాజిక వర్గాల వారు పనులు, వేటమానుకుని నిరసన దీక్షలో పాల్గొన్నారు. బల్క్ డ్రగ్‌పార్క్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా కాలుష్యంతో నిండిపోతుందని, మత్స్య సంపద నాశనమవుతుందని మత్స్యకారులు తెలిపారు. ఇప్పటికే హెటిరో పరిశ్రమ వల్ల వాయుకాలుష్యం బారిన పడుతున్నామని, వ్యర్థ రసాయనాలు సముద్రంలో వదిలివేయడం వల్ల మత్స్య సంపద నాశనమైందని, వేటకు వెళ్తే చనిపోయిన చేపలు లభ్యమవుతున్నాయని వారు చెప్పారు. ఈ ప్రాంతంలో వేట లేకపోవడంతో పూరీ, పారాదీప్, శ్రీశైలం, నాగార్జున సాగర్, అంతర్వేది ,నెల్లూరు, వంటి ప్రాంతాలకు వలసపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. అలాగే స్థానికులు కిడ్నీసమస్యలతో బాధపడుతున్నారన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ వస్తే పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని, పరిసర ప్రాంతాలన్నీ శ్మశానాలుగా మారుతాయన్నారు. ఇప్పటికే పరవాడ, అచ్యుతాపురం వంటి ప్రాంతాల్లో ఇవే సమస్యలు వస్తున్నాయన్నారు. భూములు తీసుకునే సమయంలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని మాకు చెప్పలేదని ఆరోపించారు. కంపెనీల కోసమంటేనే భూములు ఇచ్చామని ఇటువంటి ప్రాణా లు తీసే పరిశ్రమలయితే ఇచ్చేవారం కాదన్నారు.

మత్స్యకారులకు అండగా నిలుస్తాం

మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ సంఘీభావం తెలిపింది. నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణలు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా నిలుస్తామన్నారు. వారి అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే టెంట్లు వేసుకోడానికి అనుమతి నిరాకరించడం తగదన్నారు. కనీసం మైక్ పెట్టుకుని అవకాశం కల్పించడం లేదన్నారు. ఇటువంటి దుస్థితి చూస్తే ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా అనే అనుమానం కలుగుతోందన్నారు, బల్క్ డ్రగ్‌వస్తే వందలాది రసాయన పరిశ్రమలు వస్తాయని మత్స్యకారులు భయపడుతున్నారని, గతంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, అనితలు ఇక్కడ రసాయన పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకిస్తామని ప్రకటించిన విషయాన్ని మత్స్యకారులు గుర్తుచేస్తున్నారని చెప్పారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారన్నారు. కూటమి పెద్దలు మత్స్యకారుల డిమాండ్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

రాయలసీమలో రసాయన పరిశ్రమలు ఎందుకు పెట్టడం లేదు

రసాయన పరిశ్రమలు రాయల సీమ జిల్లాల్లో ఎందుకు పెట్టడం లేదని కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ప్రశ్నించారు. ఇటువంటి కంపెనీలు పెడితే అక్కడి ప్రజలు తరిమి కొడతారన్నారు. ఎలక్ట్రానిక్, కార్ల తయారీ పరిశ్రమలు, పవర్‌ప్లాంట్లు, ఇతర పరిశ్రమలు రాయలసీమ జిల్లాల్లో పెడుతూ ప్రజల ప్రాణాలు తీసే రసాయన పరిశ్రమలు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పెడుతున్నారని ఆరోపించారు. అనకాపల్లి జిల్లా ప్రజలు అమాయకులని, ప్రభుత్వాలు ఏం చేసినా చేతులు ముడుచు కుని కూర్చొంటారని, చేతకాని వారిలా చిత్రీకరించి ఈ ప్రాంతాల్లో ప్రమాదకర పరిశ్రమలు పెడుతున్నారన్నారు. ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలిగే ఒక్క పరిశ్రమకూడా ఈ ప్రాంతంలో పెట్టలేదన్నారు.బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుపై పునరాలోచన చేయాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మత్స్యకారులు

వైఎస్సార్‌సీపీ చొరవతో టెంట్ల ఏర్పాటుకు అనుమతి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు గోసల కాసులమ్మ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు,మత్స్యకార నాయకుడు ఎరిపిల్లి నాగేశ, మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలు,సత్తియ్య, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మత్స్యకార నాయకులు గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ కుమారస్వామి, తహసీల్దార్ నర్సింహమూర్తిని కలిశారు. శాంతియుతంగా నిరాహారదీక్ష చేస్తుంటే టెంట్లు వేసుకునేందుకు అనుమతి నిరాకరించడం తగదన్నారు. మండు టెండలో మత్స్యకారులు దీక్ష కొనసాగిస్తున్నారని, ఎండ వేడి వల్ల ఎవరికైనా ఏమైనా జరిగితే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. టెంట్లు వేసుకునేందుకు, మైక్‌సెట్ పెట్టుకుని వారి సమస్యలు చెప్పుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. నాయకుల వినతిపై సానుకూలంగా స్పందించిన డీఎస్పీ శ్రీనివాసరావు టెంట్లు వేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఎటువంటి హింసాత్మక సంఘటనలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ ఆందోళనలో మత్స్యకార నాయకులు మైలపల్లి సూరిబాబు, యజ్జల అప్పలరాజు, కాశీరావు,మహేష్, రాజశేఖర్, నూకరాజు, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ఉపకారం

- 30వ తేదీ వరకు ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల స్వీకరణ
- 8వ తరగతి చదివే ప్రభుత్వ విద్యార్థులు అర్హులు
- డిసెంబర్ 7న అర్హత పరీక్ష
- ఎంపికైన వారికి ఇంటర్ వరకు ఉపకార వేతనం
- ఏటా రూ.12 వేలు అందించనున్న కేంద్ర ప్రభుత్వం



గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామీణ, పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే అధికంగా చదువుకుంటారు. వీరిలో చాలామంది ఆర్థిక కారణాలతో మధ్యలో బడి మానేసి విద్యకు దూరమవుతున్నారు. దీంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువులు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తూ చేయూతనిస్తోంది. ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్స్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఈ పరీక్షలో అర్హత సాధిస్తే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తోంది. దరఖాస్తుకు ఈ నెల 30వ తేదీ వరకూ గడువు ఉంది. డిసెంబర్ 7వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు.

ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం..

8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికైతే తొమ్మిది నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉపకార వేతనం అందుతుంది. ఏడాదికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు ఇవ్వనున్నారు. ఈ మొత్తం విద్యార్థులకు సంబంధించిన ఏదైనా జాతీయ బ్యాంకు ఖాతాలో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది.

పరీక్ష విధానం...

రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఒక యూనిట్‌గా తీసుకుని విభాగాల వారీగా అర్హుల జాబితాను రూపొందిస్తారు. ఇందులో రెండు ప్రశ్నపత్రాలు ఉంటాయి. మూడు గంటల పాటు పరీక్ష సమయాన్ని కేటాయించారు. మెంటల్ ఎబిలిటీ పరీక్ష- వెర్బల్, నాన్ వెర్బల్, రీజనింగ్ నుంచి 90 ప్రశ్నలుంటాయి. 90 మార్కులకు స్కాలిస్టిక్ ఆప్టిట్యూడ్ పరీక్ష - ఇందులో 7, 8 తరగతుల స్థాయిలో నేర్చుకున్న గణితం, సామాన్య, సాంఘిక విషయాలపై ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 180 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

దరఖాస్తు విధానం

రాష్ట్ర ప్రభుత్వం సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో విద్యార్థుల దరఖాస్తులను ఆయా స్కూళ్లు సమర్పించాలి. ఆ దరఖాస్తులను ధ్రువీకరణ పత్రాలను డీఈవోకు అందజేయాలి.

ఎవరు అర్హులు...

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ 7వ తరగతిలో ఓసీ, బీసీలైతే 55 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులు లేదా దానికి సమాన మైన గ్రేడ్ పొందిన విద్యార్థులు అర్హులు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదు. ప్రభుత్వ ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చును. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంది. ఈ ఏడాది ఎనిమిదో తరగతి విద్యార్థులు www.bre.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పరీక్షకు సన్నద్ధం చేస్తున్నాం



గతేడాది జిల్లాలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 8వ తరగతి విద్యార్థులు 2,600 మంది హాజరు కాగా 132 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది పరీక్షలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. దీనికి సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థితో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేయించాలని చెప్పాం. – గిడ్డి అప్పారావు నాయుడు, డీఈవో, అనకాపల్లి

పరీక్షలో అర్హత సాధిస్తా



ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించాలని ప్రత్యేకంగా ప్రిపేర్ అవుతున్నాను. స్కూలు ఉపాధ్యాయులు నాకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఏటా రూ.12 వేలు ఉపకార వేతనం వస్తే నా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుంది. విద్యావరంగా చిన్నచిన్న అవసరాలు సమకూర్చుకుంటాను.
–బి.ధనశ్రీ, 8వ తరగతి విద్యార్థిని, గవరపాలెం చిన్న హైస్కూల్, అనకాపల్లి

క్లుప్తంగా

స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సుకు దరఖాస్తులు

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో స్పోర్ట్స్ కోటా నియామకదారుల కోసం స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సు 2025–26 (స్పోర్ట్స్ కోచింగ్‌లో డిప్లొమాకు సమానం) పాటియాలలోని ఎస్ఏఐ డిప్యూటీ డైరెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎల్.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ లోపు httpr://www.nrir.inను సంప్రదించాలని కోరారు.

పెద్దేరు నదిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

చోడవరం: పెద్దేరునదిలో వృద్ధురాలు మృతదేహం గురువారం లభ్యమైంది. మండలంలోని గౌరీపట్నం వంతెన సమీపంలో 70 యేళ్ల వయస్సున్న వృద్ధురాలు మృతదేహం పెద్దేరు నదిలో తేలుతూ కనిపించడంతో స్థానికులు చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఫైర్ సిబ్బంది సహకారంతో నదిలో ఉన్న వృద్ధురాలి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం వివరాల కోసం పోలీసులు ఆరా తీయగా చీడికాడ మండలం దండిసురవరం గ్రామానికి చెందిన బైన నారాయణమ్మ (70)గా గుర్తించారు. ఈమె ప్రమాదవశాత్తూ నదిలో పడిపోయిందా లేదా ఎవరైనా ఉద్దేశపూర్వంగా నదిలో పడేశారా అనేదానిపై విచారణ చేస్తున్నామని సీఐ అప్పలరాజు చెప్పారు.

మాచ్‌ఖండ్‌లో సాంకేతిక లోపం

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో రెండో నంబరు జనరేటర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. వై పేస్ చెడిపోయి, భారీగా శబ్దం రావడంతో అప్రమత్తమైన ప్రాజెక్టు సిబ్బంది 17 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. గత మూడు రోజుల క్రితం నుంచి ప్రాజెక్టులో అన్ని జనరేటర్లు పని చేయడంతో 120 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో మళ్లీ తలెత్తిన సాంకేతిక లోపం ప్రాజెక్ట్ అధికారులను నిరాశ పరిచింది. వినియోగంలోకి తెచ్చేందుకు ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు.

పలు పాఠశాలల సందర్శన



కంచుగుమల పాఠశాలలో సమీక్షిస్తున్న డైట్ భీమునిపట్నం అధ్యాపకులు

రోలుగుంట/రావికమతం/బుచ్చియ్యపేట: భీమునిపట్నంలోని డైట్ కళాశాల అధ్యాపక బృందం సభ్యులు గురువారం మండలంలో పలు పాఠశాలలను సందర్శించారు. చోడవరం నియోజకవర్గంలోని రోలుగుంట, రావికమతం, బుచ్చియ్యపేట మండలాల్లోని పలు పాఠశాలలను పరిశీలించారు. రోలుగుంట మండలం కంచుగుమల, కొంతల గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. విద్యా ప్రమాణాలను సమీక్షించారు. మూల్యాంకనం, గ్రేడింగ్, విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ఆరా తీశారు. సిలబస్ ఎంత వరకూ పూర్తయిందో తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్ బుక్స్, రాత పరిశీలించి సామర్థ్యాలను అంచనా వేశారు. నాణ్యమైన బోధన, సమర్థవంతమైన అభ్యాసనపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. అధ్యాపకులు సిహెచ్.స్వామి, ఎస్.కె.అల్లాద్దీన్, ఎం.వి.రమణ. ఉదయ్ శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



బైక్‌జాతాలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

మాడుగుల రూరల్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రణభేరి బైక్ జాతా గురువారం ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకుంది. ఈ జాతా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి. చంద్రరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహించి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడం ద్వారా రణభేరి మోగించాలని నిర్ణయించినట్టు రాష్ట్ర నాయకులు ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా పలు మండలాలు నుంచి వచ్చిన ఉపాధ్యాయులు నినాదాలు చేస్తూ ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శరగడం జగ్గారావు, యూనియన్ నాయకులు ఎస్.ఎస్. నాగమణి, గంజి నాగేశ్వరావు, రమేశ్, కృష్ణ, నారాయణ, అప్పారావు, రవికుమార్, ఆనంద్, కామరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

విశాఖలోనే ఈఎస్ఐ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నరసింగరావు

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ మెడికల్ కాలేజీని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడంపై సీపీఎం, సీఐటీయూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒత్తిడి కారణంగానే ఈ నిర్ణయం జరిగిందని సీపీఎం నాయకుడు, సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ఆరోపించారు. సీపీఎం కార్యాలయంలో గురువారం సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారి ఎస్. జ్యోతీశ్వరరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. అత్యధికంగా ఈఎస్ఐ సభ్యులు 14 లక్షల మంది ఉన్న ఉత్తరాంధ్రలో కాకుండా అమరావతిలో మెడికల్ కాలేజీ పెట్టడం సరికాదన్నారు. షీలానగర్‌లో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం తుది దశలో ఉందని, దానికి అనుబంధంగా మెడికల్ కాలేజీని కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి మాత్రమే కాదని, వెనుకబడిన ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేస్తామని నరసింగరావు హెచ్చరించారు. ఈఎస్ఐ బోర్డుపై ఒత్తిడి తెచ్చిన కారణంగానే 2022 నుంచి షీలానగర్‌లో ఆస్పత్రి నిర్మాణం వేగవంతమైందని ఆయన గుర్తు చేశారు.

విద్యార్థుల సమస్యలపై నేడు నిరసన

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యార్థులతో నిరసన చేపట్టనున్నట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్, వైఎస్సార్ సీపీ పాలనలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని తదితర డిమాండ్లతో ధర్నా చేయనున్నట్టు పేర్కొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: పరవాడ మండలం, ముత్యాలమ్మపాలెం శివారులోని జాలారీపేట గ్రామంలో బుధవారం జరిగిన హత్య కేసులో నిందితుడు ఒలిశెట్టి కొదండను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటల సమయంలో కొదండ.. గొడవపడి తన భార్య లక్ష్మి (45)ని కత్తితో పొడిచి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.గురువారం నిందితుడు కొదండ వెన్నలపాలెం సినిమా హాలు కూడలిలో సంచరిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అనంతరం అనకాపల్లిలోని 11వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించగా.. విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన



కశింకోట రైల్వే గేటు వద్ద భూముల సేకరణపై పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కశింకోట: మండలంలోని మూడు ప్రాంతాల్లో రైల్వే గేట్ల వద్ద ఫ్లై ఓవర్ వంతెనలను నిర్మించడానికి అవసరమైన భూముల సేకరణ కోసం గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. కశింకోట, నరసింగబిల్లి, ఎఎస్ పేట రైల్వే గేట్లను ఈ సందర్భంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ వంతెనల నిర్మాణానికి సేకరించాల్సిన భూముల వివరాలపై ఆరా తీశారు. భూముల వివరాలు సేకరించి నివేదించిన తర్వాత ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, తహసీల్దార్ సిహెచ్ తిరుమలరావు, మండల సర్వేయర్ ధనుంజయ, రైల్వే ఏజెన్సీ ప్రతినిధులు, వీఆర్‌ఒలు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

జేసీబీ, 3 లారీల సీజ్

అనకాపల్లి టౌన్: మండలంలోని సంపతిపురం వుడా లే అవుట్‌లో ఎటువంటి ప్రతాలు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో ఒక జేసీబీ, మూడు లారీలను సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ గురువారం తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం వాటిని మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

కూలి పనికి వెళ్లి మృత్యువాత

- వెదురుకర్ర నరుకుతుండగా విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి
- మరొకరికి గాయాలు



విద్యుత్ తీగల్లో చిక్కుకున్న ప్రమాదానికి కారణమైన వెదురుకర్ర



కోటవురట్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గరగా నాగేశ్వరరావు

కోటవురట్ల: అనుకోని ఉపద్రవం విద్యుత్ రూపంలో ఓ వ్యక్తి ఉసురు తీసింది. మండలంలోని చౌడువాడ గ్రామంలో గురువారం వెదురు కర్రలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు హై వోల్టేజ్ విద్యుత్ తీగలకు కర్ర చిక్కుకుని రాయి నాగేశ్వరరావు(55) అనే కూలీ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరొక కూలీ గరగా నాగేశ్వరరావు గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మాకవరపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చౌడువాడ లైన్‌లో గురువారం జంగిల్ క్లియరెన్సు నిర్వహించారు. ఈ పనిలో భాగంగా చౌడువాడ గ్రామానికి చెందిన వీరిద్దరూ నిచ్చెన కోసం వెదురు కర్రలు నరికేందుకు సిద్ధమయ్యారు. రాయి నాగేశ్వరరావు వెదురు కర్రను పట్టుకోగా, గరగా నాగేశ్వరరావు కత్తితో నరుకుతున్నాడు. ఈ క్రమంలో వెదురు కర్ర ఆన్‌రాక్‌కు వెళుతున్న హై వోల్టేజ్ విద్యుత్ లైన్‌లో చిక్కుకుంది. దానిని పట్టుకున్న రాయి నాగేశ్వరరావుకు షాక్ తగలడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పక్కనే ఉన్న గరగా నాగేశ్వరరావుకు కొద్దిపాటి షాక్ తగలడంతో ఎగిరి పడి గాయపడ్డాడు. వెంటనే అతడిని కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మృతుడు రాయి నాగేశ్వరరావుకు భార్య చిట్టిలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు

సుమారు 17.5 తులాల బంగారం వస్తువుల అపహరణ



బాధితులనుంచి వివరాలు తెలుసుకుంటున్న ఇంచార్జ్ క్రైం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

మద్రిపాలెం/గాజువాక: నగరంలో గొలుసు దొంగలు రెచ్చిపోయారు. కంచరపాలెం, గాజువాక పరిధిలో ఆరు వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం రాత్రి మహిళల మెడలో నుంచి సుమారు 17.5 తులాల బంగారం వస్తువులను అపహరించారు. బాధితులు క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఒక బైక్‌పై జ్ఞానాపురం, కంచరపాలెం రైతుబజారు, ఇండస్ట్రియల్ ఎస్టేట్, బిర్లా జంక్షన్ వంటి ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. ఒక వ్యక్తి హెల్మెట్ ధరించి బైక్ నడుపగా, వెనుక కూర్చున్న వ్యక్తి మాస్క్ ధరించి మహిళలను అడ్రస్ అడుగుతున్నట్టు నటిస్తూ వారి మెడలోని గొలుసులను లాక్కొని పారిపోయారు. జ్ఞానాపురంలో ఎం. అనంతలక్ష్మి మెడలో 3 తులాల గొలుసు, రామ్మూర్తి పంతులుపేటకు చెందిన విజయలక్ష్మి మెడలో 4.5 తులాల గొలుసు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద సంతోషి మెడలో 22 గ్రాముల గొలుసు, బిర్లా జంక్షన్ వద్ద ప్రవంతి మెడలో 3 తులాల గొలుసు దొంగతనం చేశారు.

విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులను వెంబడించగా, వారు బిర్లా జంక్షన్ దాటిన తర్వాత బైక్‌ను వదిలి పారిపోయారు. నిందితులు ఉపయోగించిన బైక్ గతంలో మహారాణిపేటలో చోరీకి గురైనట్లు పోలీసుల విచారణలో తేలింది. క్రైమ్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, కంచరపాలెం క్రైమ్ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ ఘటన జరిగిన ప్రాంతాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. కంచరపాలెం క్రైమ్ సీఐ చంద్రమౌళి నేతృత్వంలో పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాజువాకలోని షీలానగర్‌లో బుధవారం రాత్రి రెండు వేర్వేరు చైన్ స్నాచింగ్ ఘటనలు జరిగాయి. రెండు దొంగతనాల్లో మొత్తం 4.5 తులాల బంగారం అపహరణకు గురైంది. షీలానగర్‌కు చెందిన లక్ష్మీ ప్రియ.. డీమార్ట్ నుంచి ఇంటికి నడిచి వెళ్తుండగా, ఇద్దరు బైక్‌పై వచ్చిన యువకులు ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద లక్ష్మి తన అత్తతో కిలిసి వెళ్తుండగా అదే తరహాలో బైక్‌పై వచ్చిన యువకులు ఆమె మెడలోని 2.5 తులాల పుస్తెల తాడును తెంపుకొని వెళ్లిపోయారు.గాజువాక క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘాటి.. మన్యం అందాలు మీటి



ప్రాజెక్టుకు వెళ్లే వించ్‌పై ఫైటింగ్ సన్నివేశంలో కథానాయిక అనుష్క శెట్టి

ముంచంగిపుట్టు: ఇటీవల విడుదలైన 'ఘాటి' సినిమా కేవలం ఒక థ్రిల్లర్ మాత్రమే కాదు, ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లోని అద్భుతమైన పర్యాటక ప్రాంతాలకు ఒక దృశ్య వేదికగా మారింది. ఈ నెల 5న విడుదలైన ఘాటి చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించగా.. అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించింది. విక్రమ్ ప్రభు, జగపతి బాబు, చైతన్య రావు, జిషు సేన్ గుప్త వంటి ప్రముఖ నటులు ముఖ్య పాత్రలు పోషించారు.

ప్రత్యేక ఆకర్షణగా సహజసిద్ధ అందాలు

సినిమా షూటింగ్‌లో ఎక్కువ భాగం ఏవోబీ సరిహద్దు ప్రాంతాలైన డుడుమ జలాశయం, డుడుమ జలపాతం, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, వించ్ హౌస్, వ్యూపాయింట్, బలడ కేవ్స్ వంటి ప్రదేశాల్లో చిత్రీకరించారు. సినిమా చూస్తున్నంత సేపు వెండితెరపై ఈ ప్రాంత సహజసిద్ధ అందాలు కనిపిస్తూనే ఉంటాయి.

డ్రోన్ విజువల్స్ హైలైట్

పోలీసు అధికారుల పాత్రలో నటించిన జగపతిబాబు, జాన్ విజయ్ డుడుమ జలాశయం డ్యామ్‌పై వాహనాలను తనిఖీ చేసి, లిక్విడ్ గంజాయిని పట్టుకున్న సన్నివేశం చాలా ఆసక్తికరంగా చిత్రీకరించారు. డుడుమ జలపాతం , మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని డ్రోన్‌తో చిత్రీకరించిన అద్భుతమైన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. సినిమా కెమెరామెన్ మనోజ్ సరిహద్దు ప్రాంతాల అందాలను చాలా చక్కగా ఒడిసిపట్టి తెరపై చూపించగలిగారు.

పేదలకు లేటెస్ట్ కాస్మోటాలజీ సేవలు

కేజీహెచ్‌లో డెర్మటాలజీకి నూతన పరికరాలు



ఫ్రాక్షనల్ సీవో 2 మిషన్



నారో బ్యాండ్ ఫోటోథెరపీ మెషీన్



ఎన్‌బీ యువీబీ



క్యూ స్విచ్డ్ ఎన్‌డీ.వైజీ మిషన్

మహారాణిపేట: కేజీహెచ్ డెర్మటాలజీ విభాగం రోగులకు శుభవార్త అందించింది. అత్యాధునిక చర్మ, సౌందర్య సమస్యలకు ఉచిత చికిత్స అందించేందుకు రూ. 45 లక్షల విలువైన క్యూ-స్విచ్డ్ ఎన్డీ-వై ఏజీ లేజర్ యంత్రాన్ని కొను గోలు చేసింది. ఈ లేజర్ యంత్రాన్ని ప్రభుత్వం ద్వారా సమకూర్చారని, దీంతో పాటు మరికొన్ని ఆధునిక యంత్రాలు కూడా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా లభించాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి తెలిపారు. ఈ కొత్త పరికరాలతో పేదలకు కూడా అధునాతన కాస్మోటిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయని వారు పేర్కొన్నారు.

అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలు

లేజర్ చికిత్సలు: కేజీహెచ్ డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి. శాంతి మాట్లాడుతూ.. ఈ కొత్త లేజర్ యంత్రం ముఖ్యంగా మంగు మచ్చలు, మొటిమల మచ్చలు, స్ట్రెచ్ మార్క్స్ తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. శస్త్రచికిత్స అవసరం లేకుండానే ఈ సమస్యలకు చికిత్స అందించవచ్చని తెలిపారు. రోజేసియా, స్టెరాయిడ్స్ వాడకం వల్ల ఏర్పడిన మచ్చలను కూడా ఈ లేజర్‌తో సురక్షితంగా తొలగించవచ్చని వివరించారు.

జుట్టు, చర్మ సంరక్షణ: అనవసరమైన హెయిర్ తొలగింపు, బొల్లి , సోరియాసిస్ వంటి చర్మ వ్యాధులకు 'నారో బ్యాండ్ ఫోటోథెరపీ'తో కాంతి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

జుట్టు ఎదుగుదలకు చికిత్సలు: జుట్టు రాలడం సమస్య ఉన్నవారికి ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీలో లెవల్ లైట్ థెరపీ ద్వారా చికిత్సలు కూడా ఉచితంగా అందిస్తున్నామని డాక్టర్ శాంతి తెలిపారు.

ఈ ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం ద్వారా కేజీహెచ్ చర్మ చికిత్సల విభాగం మరింత బలోపేతం అయిందని, దీనివల్ల పేద, మధ్యతరగతి రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

24 నుంచి అడ్వెంచర్ ట్రెక్కింగ్ క్యాంప్

- అరకువ్యాలీలో నిర్వహణ
- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : ఈనెల 24 నుంచి వచ్చేనెల ఒకటి వరకు నేషనల్ అడ్వెంచర్ ట్రెక్కింగ్ క్యాంప్ అరకువ్యాలీలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, డీఎఫ్‌వో, డీఎంహెచ్‌వో, డీపీఆర్వో, సర్వ శిక్ష ఏపీసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్రెక్కింగ్ క్యాంప్‌ను 13వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ నిర్వహిస్తుందన్నారు. పలు రాష్ట్రాల నుంచి 565 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు రానున్నట్టు చెప్పారు. ఈ క్యాంప్ నిర్వాహణ కోసం నోడల్ అధికారిగా సర్వ శిక్ష ఏపీసీ స్వామినాయుడును నియమించామన్నారు. ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల ఒకటి వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జేసీ అభిషేక్ గౌడ, ఎస్పీ అమిత్‌బర్దర్, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ, 13వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ నీరాజ్‌కుమార్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, డీపీఆర్వో బాల్ మాన్‌సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి టౌన్: నాణ్యతో కూడిన రహదారి నిర్మించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు పేర్కొన్నారు. మండలంలోని కొండుపాలెంలో మండల పరిషత్ నిధులతో సిమెంట్ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా పటిష్టంగా రోడ్డు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, ఎంపీటీసీ ముదుపాడ లక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కసిరెడ్డి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు గనిశెట్టి బుజ్జి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు భవనం వార్షికోత్సవం నేడు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులో న్యాయస్థానం ఎదురుగా అమరజీవి పొట్టి శ్రీరాములు భవనం 24వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పి.ఎం.ఎల్.నరసింహం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రకాశం జిల్లా మార్లెళ్ల గ్రామానికి చెందిన పొట్టి శ్రీరాములు మేనల్లుళ్లు గునుపూడి సుబ్రహ్మణ్యం, వెంకట సత్యనారాయణ, హైదరాబాద్‌కు చెందిన సినీ నిర్మాత చెక్కా వెంకట సత్యనారాయణబాబ్జి గుప్తా, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్ వీఎస్ నూకరాజు విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు.

దళిత వాడల్లో ఆలయాలపై హర్షం

అనకాపల్లి టౌన్: దళిత వాడల్లో వెయ్యి కొత్త దేవాలయాలను నిర్మించాలన్న తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ డి.డి. నాయుడు తెలిపారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయాలు నిర్మించడం వల్ల ఆధ్యాత్మిక సమానత్వాన్ని బలోపేతం చేస్తుందన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ముగ్గురికి పదోన్నతి లభించింది. అందే నాగేశ్వరరావు, ఎన్వీ జ్యోతి, కేఆర్‌కే శర్మలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరికి జీవీఎంసీ ప్రధాన కమిషనర్ కేతన్ గార్గ్ తన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు.

నేడు, రేపు దస్తా లేఖర్ల పెన్‌డౌన్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని దస్తా లేఖర్లు ఈ నెల 19, 20 తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ దస్తావేజు లేఖర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అయోధ్య శేషు, కార్యదర్శి బొగ్గారపు వెంకట గున్నాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్డు 2.0 పద్ధతిలో లోపాలు సరిచేయాలని ఎన్నిసార్లు విజ్ఞాపనలు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ చర్యలు నిరసిస్తూ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 60 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	5,150
రెండో రకం	3,900	3,900
మూడోరకం	3,500	3,730

అనకాపల్లి సినిమాలు

రాజా	:భద్రకాళి
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	:టన్నెల్
పర్తిసాయి	:బ్యూటీ
షిర్డీసాయి	:కూలీ
వెంకటేశ్వర	:లిటిల్ హార్ట్స్
రామచంద్ర	:మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 351 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.

యూరియా.. లేదయా?

- రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు నిల్
- ప్రైవేటు డీలర్ల వద్ద అదే పరిస్థితి
- తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ఎరువుల కొనుగోలు



కశింకోటలో యూరియా లేక వెలవెలబోతున్న ప్రైవేటు డీలర్ దుకాణం



యూరియా ఉన్నప్పుడు రైతులతో నిండి ఉన్నప్పటి ఎరువుల దుకాణం

కశింకోట: మండలంలో యూరియా నిండుకుంది. ఇప్పటికే కశింకోటలోని ప్రైవేటు డీలర్, 15 రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు గురువారానికి అయిపోయాయి. ఇక కేవలం తాళ్లపాలెంలోని ప్రైవేటు డీలర్ వద్ద మాత్రమే నిల్వ ఉంది. అది కూడా ఎప్పుడు అయిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. మళ్లీ యూరియా రావడానికి రెండు రోజులు పడుతుందని డీలర్లు, అధికారులు చెబుతున్నారు. దీంతో వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ యూరియా ఎప్పుడు వస్తుందోనని, సకాలంలో ఎరువు వేయకపోతే వరి పొలం ఎదుగుదల ఉండదని భావిస్తూ ధర ఎక్కువ అయినప్పటికి ప్రత్యామ్నాయంగా ఇతర ఎరువులను గత్యంతరం లేక విక్రయించి తీసుకెళ్లాల్సిన పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు.

ఇతర ఎరువుల కొనుగోలు

యూరియా బస్తా రూ.270 కాగా, డీఏపీ రూ.1350, గ్రోమోర్ రూ.1800, సూపర్ రూ.500 వంతున నిర్ణీత ధరలకు విక్రయాలు జరుగుతున్నాయి. యూరియాతో పోల్చుకుంటే వీటి ధరలు అత్యధికంగా ఉన్నా పంటలను రక్షించుకోవడానికి కొనుగోలు చేయక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంతోపాటు అనకాపల్లి, యలమంచిలి, అచ్యుతాపురం మండలాల గ్రామాల నుంచి రైతులు ఇప్పటి వరకు ఇక్కడ దొరుకుతున్న యూరియా కోసం వచ్చి నిల్వ లేక ఇతర ఎరువులను కొనుగోలు చేసి వెళ్తున్నారు. ఇప్పటి వరకు రైతులతో కళకళలాడిన ఎరువుల దుకాణం యూరియా లేక ఇప్పుడు వెలవెలబోతోంది.

ప్రైవేటు డీలర్ వద్ద యూరియా కోసం..

తాళ్లపాలెంలో మాత్రం ప్రైవేటు డీలర్ వద్ద యూరియా అధికారుల సమాచారం ప్రకారం 37 మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉన్నాయి. దీన్ని రైతు ఒక్కంటికి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు ఆధారంగా వేలిముద్రలు నమోదు చేసుకొని రైతుకు రెండు బస్తాల వంతున ప్రస్తుతం అందజేస్తున్నారు. మండల గ్రామాల రైతులకు ప్రాధాన్యం ఇచ్చి నిల్వలు విక్రయిస్తున్నామని నిర్వాహకులు అంటున్నారు. ఈ నిల్వ ఎప్పటి వరకు అందుబాటులో ఉంటుందో తెలియని పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. స్థానికేతరులు కూడా యూరియా కోసం ఇక్కడకు వస్తున్నప్పటికి స్థానికులకే ప్రాధాన్యం ఇచ్చి యూరియా విక్రయిస్తున్నారు. ప్రస్తుత దశలో వరికి యూరియా ఎరువు అత్యవసరంగా వేయాల్సి ఉందని, అవసరం ఉన్న మేరకు ఎరువును అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా విజిలెన్స్ అధికారులు యూరియా, ఇతర ఎరువుల నిల్వలపై కశింకోటలో ప్రైవేటు డీలర్ దుకాణాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.



యూరియా లేక గ్రోమోర్ తీసుకెళ్తున్న రైతు

గ్రోమోర్ తెచ్చుకోవాల్సి వచ్చింది



సుమారు 4 ఎకరాల్లో వరి పొలం వేశాం. దానికి ప్రాథమిక దశలో యూరియా ఎరువు వేయాల్సి ఉంది. దాని కోసం అనకాపల్లి, చోడవరం, కశింకోట ప్రాంతాల్లో తిరిగినప్పటికి లభ్యం కాలేదు. గత్యంతరం లేక ధర అత్యధికమైనప్పటికి గ్రోమోర్ ఎరువును తీసుకెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల రైతులపై అధిక భారం పడుతుంది. ఇంత పెట్టుబడి పెట్టి పంట పండించడం వ్యయంతో కూడిన పని. ఈ విషయాన్ని గుర్తించి రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

–బి. జాన్, రైతు, మొండిపాలెం, అనకాపల్లి మండలం

తాళ్లపాలెంలో 37 మెట్రిక్ టన్నుల నిల్వలు

మండలంలోని తాళ్లపాలెంలో ప్రైవేటు డీలర్ వద్ద యూరియా ఎరువు 36 మెట్రిక్ టన్నుల మేర నిల్వ ఉంది. దీన్ని రైతులకు కొరత లేకుండా అందిస్తున్నాం. ఇప్పటికే 637 మెట్రిక్ టన్నుల ఎరువు ప్రైవేటు డీలర్లు, 15 రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేశాం. కశింకోట డీలర్ వద్ద గురువారం యూరియా నిల్వ అయిపోయింది. మళ్లీ యూరియా రావలసి ఉంది. మరో రెండు రోజుల్లో నిల్వ వచ్చే అవకాశం ఉంది.

–ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

విద్యుత్ ఉద్యోగుల ధర్నా



గవరపాలెం విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

అనకాపల్లి:

విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చులు చెల్లించాలని ట్రేడ్ యూనియన్, ఏపీ విద్యుత్ ఎంప్లాయీస్(1104) యూనియన్, కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ అనకాపల్లి ప్రతినిధులు అనకాపల్లి నూకరాజు, పడాల సోమన్నదొర, సుంకర నాగరాజు, పేరపు రాంబాబు డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో నిబంధనలు సడలించాలని, 2019లో నియమితులైన ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలని, బకాయి డీఏలు చెల్లించాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్వ పద్ధతిలో మూడు నెలలకోసారి సర్కిల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పీఎన్‌సీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఓలుమరక శ్రీనివాసరావు, త్రినాథ్ కుంచు బాబు, చవితిని నర్సింగరావు, ఎం.సత్తిబాబు, రాజబాబు, రవికుమార్, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

తుమ్మపాల: కొప్పాక సబ్ స్టేషన్ పరిధి శంకరం రూరల్ ఫీడర్‌లో ప్రీమాన్సూన్ ఇన్‌స్పెక్షన్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో శంకరం, బట్లపూడి, గొలగాం, గోపాలపురం, రేబాక, చింతనిప్పుల అగ్రహారం, కోడూరు, కొండుపాలెం గ్రామాల్లో ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

20న కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో..

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఈ నెల 20న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండబోదని ఏపీ ఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. కన్నూరుపాలెంతోపాటు పాత కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు నిర్ణీత సమయంలో అంతరాయం కలగనుందన్నారు. ఆయా గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఆ రోజు తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని వినియోగదారులను కోరారు.

క్యాన్సర్‌పై అప్రమత్తం



మాట్లాడుతున్న హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు

అనకాపల్లి టౌన్: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగనంపూడి హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ నమిత పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు నర్సింగ్‌రావుపేట ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రదీప్, స్వప్నిక్ రాయ్, గ్రామ పెద్దలు సోఫయా డాలీ, కసిరెడ్డి సత్తిబాబు, చేబోలు దుర్గాప్రసాద్, ఈత గోపి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

- రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుమ్మపాల: యూరియా కొరతతో అవస్థలు పడుతున్న రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం జిల్లా నాయకులు, రైతులు నిరసన చేపట్టారు. అవసరానికి తగ్గట్లుగా రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న విమర్శించారు. లోపాన్ని సరిదిద్దుకుని వెంటనే యూరియా సరఫరా చేసే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డీఆర్వో సత్యనారాయణరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ దారుణం'

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు విమర్శించారు. బడ్జెట్‌లోనే కొన్ని రంగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడమే తమ ప్రభుత్వ విధానమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల విశాఖ సమ్మిట్‌లో ప్రకటించడం దారుణమన్నారు. 1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు ప్రైవేటీకరణ విధానాలు ఇప్పటికీ ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. అవే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించకూడదని కార్మికులు పెద్ద ఎత్తున్న ఉద్యమాలు చేస్తున్నా, ఏకపక్షంగా ప్రజల ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం దేశ భవిష్యత్‌కు హానికరమైనదన్నారు. నేడు అమలవుతున్న ప్రైవేటీకరణ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు.

దసరా నవరాత్రులకు ప్రత్యేక ఏర్పాట్లు



దసరా నవరాత్రుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల ఉత్సవాలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక గవరపాలెం భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో వారు ఉత్సవ పోస్టర్, నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆలయం వద్ద తొమ్మిది రోజులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. ఈ నెల 22న ఉదయం 9 గంటలకు ఆలయంలో వినాయక పూజ, కలశ ప్రతిష్టాపనతో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రోజూ మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతులు ఆర్థిక సాయంతో భవానీ, అయ్యప్ప మాలాధారణ భక్తులకు ఉచిత అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 2వ తేదీన రాత్రికి 25 ట్రాకర్లుపై అమ్మవారు భారీ విగ్రహాలను భారీ ఊరేగింపు, వివిధ రాష్ట్ర కళాకారులతో నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకూ గవరపాలెం గౌరీ సేవా సంఘంలో సాయంత్రం 6 గంటలకు ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు కాండ్రేగుల నూకఅప్పారావు, రాజారావు, కర్రి సన్యాసినాయుడు, కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కొణతాల వరప్రసాద్, కె.ఎం.నాయుడు, పీలా రాముడు, మద్దాల శంకరరావు, దాడి కృష్ణ, సూరిశెట్టి నరసింగరావు, ఓంనమఃశివాయ, మళ్ల జగ్గప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌ను దూషించిన వ్యక్తి అరెస్ట్

పాయకరావుపేట: రాజమండ్రి బస్సు డిపో కండెక్టర్ గోగాడ రేష్మను ఈ నెల 7న మధ్యాహ్న సమయంలో దూషించిన భూపతి శివ అనే వ్యక్తిని పాయకరావుపేట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పాయకరావుపేట బస్టాండ్‌లో బస్సులో ఉన్న రేష్మ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించారు. రేష్మా ఫిర్యాదు మేరకు శివను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జె.పురుషోత్తం తెలిపారు.

భారీ వినాయకుడికి ప్రత్యేక పూజలు



వినాయకున్ని దర్శించుకున్న మాజీ మంత్రి అమర్‌నాథ్ తల్లి నాగమణి, కుటుంబ సభ్యులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సంపత్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల లక్ష్మీగణపతి వినాయకున్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తల్లి నాగమణి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అత్యంత పెద్ద వినాయకుడిని అనకాపల్లిలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. అనంతరం కమిటీ సభ్యులు నాగమణిని శాలువాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్, వైద్యుడు జి.రామ్మూర్తి, నూకాంబికా దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కశింకోటలో దుర్గమాంబకు పూలమాలతో అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక గవరపేటలో దుర్గమాంబ ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారిని నూతన వస్త్రాలు, గజ పూలమాల, ఆభరణాలు అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రజలు ఎక్కువగా దర్శించారు. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో అమ్మవారికి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విశాఖ డెయిరీ మలసాల రమణారావు తదితరులు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో సన్నాయి మేళాతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని, ఆలయం నుంచి సంతబయల అమ్మవారి ముఖ ద్వారం వరకు అందంగా విద్యుద్దీపాలంకరణ చేశారు. ఇది ఆహూతులను ఆకట్టుకుంది. ఆలయం వద్ద బాలికలు కోలాటాలు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. రాత్రి ఆలయంతోపాటు సంతబయల కూడా డాన్స్ మెగా ఈవెంట్లు జరిగాయి. ప్రజలు ఎక్కువగా ఉత్సాహంగా పాల్గొన్నారు.



విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావును దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు

వైభవంగా గ్రామదేవత నేస్తాలమ్మ పండగ



నేస్తాలమ్మను దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



సమారాధనలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం ప్రజల ఇలవేల్పు నేస్తాలమ్మ పండగను ఇరు గ్రామాల ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిపారు. పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య దంపతులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. భక్తులు ఉదయం 6 గంటల నుంచే ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక పోటీలు



క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ: జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.వినోద్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాల, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో పలు క్రీడల్లో గురువారం ఎంపిక పోటీలు నిర్వహించారు. కుస్తీ, తంగాట, ఘట్కా, థాంగ్‌టా, మార్షల్ ఆర్ట్స్ విభాగాల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ యూ–19 ఆర్గనైజింగ్ కార్యదర్శి వీఏ పుష్పలత తెలిపారు.

నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఎన్టీపీసీ కృషి

- స్టేక్‌హోల్డర్ల సమావేశంలో సంస్థ ఈడీ సమీర్‌శర్మ



స్టేక్ హోల్డర్స్ సమావేశంలో ఈడీ సమీర్ శర్మతో ప్రజా ప్రతినిధులు, అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి తదితర ప్రజోపయోగ కార్యక్రమాల అమలుకు సంస్థ విశేష కృషి చేస్తోందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ తెలిపారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో దీపాంజలినగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఎన్టీపీసీ స్టేక్ హోల్డర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక సామాజిక సంక్షేమానికి దోహదపడుతూనే సమాజ అవసరాలను తీర్చే ప్రభావవంతమైన ప్రాజెక్టులను సంస్థ చేపడుతుందన్నారు. సీఎస్సార్ విభాగం ద్వారా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, 2025–26లో చేపట్టనున్న కార్యచరణలో ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారం గురించి మాట్లాడారు.

వాడచీపురుపల్లి సర్పంచ్ శివలంక లక్ష్మి మాట్లాడుతూ వాడచీపురుపల్లి శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులతోపాటు, డస్ట్‌బిన్లు మంజూరు చేయాలని కోరారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య వెంకటపతిపాలెం సామాజిక భవనం, నాయుడుపాలెం శ్మశానవాటిక అభివృద్ధి, సీసీ కాలువలు, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అడిగారు. శిథిలావస్థలో ఉన్న వాడచీపురుపల్లి–పరవాడ రహదారిని అభివృద్ధి చేయాలని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు కోరారు.పంచాయతీల్లో చెత్తను తరలించేందుకు అవసరమైన వాహనాలను ప్రతి పంచాయతీకి మంజూరు చేయాలని రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు అడిగారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బ్రేక్‌డౌన్ లారీని ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



సబ్బవరం: మండలంలోని జాతీయ రహదారి మర్రిపాలెం టోల్‌ప్లాజా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వెన్నెపూడికి చెందిన దూలిపల్లి అప్పారావు(42) బుధవారం రాత్రి చేగోడీలు, జంతికల లోడుతో కాకినాడ నుంచి విజయనగరం వస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్‌ప్లాజా వద్ద బ్రేక్ డౌన్ అయిన లారీని వెనుకవైపు బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటో ముందుభాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ అప్పారావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ రామచంద్రరావు సిబ్బందితో సంఘటన స్థలికి చేరుకుని, ప్రమాద కారణాలను పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను, లారీని అదుపులోకి తీసుకుని, మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు సీఐ తెలిపారు.